ఓం శ్రీసాయిరాం

# ముందుమాట

తే॥ మార్చి 3, 2007, శ్రీ సత్యసాయి దీనజనోద్ధరణ పథకం బాలుర జీవితాలలోనే కాకుండా, ప్రశాంతి నిలయంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య సమక్షంలో ప్రదర్శింపబడిన సంగీత నృత్యనాటిక 'జాగృతి'ని తిలకించి ఆనందించిన అశేష భక్త జనావళి జీవితాలలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన రోజు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ దీనజనోద్ధరణ పథకం బాలుడు చి॥సాయిమణి స్వామి వారి దివ్య సమక్షంలో చేసిన ప్రసంగము శ్రోతల హృదయాలను కదిలించి కన్నీరు తెప్పించింది. 'జాగృతి' నాటిక రచన, సంభాషణలు, నటన, భగవానుని ఎంతో ఆనందింపచేసాయి. స్వామివారు ఆ బాలనటులందరిని ప్రత్యేకంగా ఆశీర్వదించడం ఎంతో మధురమైన అనుభూతి. భగవాన్ తమ అభీష్టముగా ఈ నాటికను అన్ని పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ, 'శివం' ఇతర సాయిమందిరాలు కేంద్రాలలోను ప్రదర్శించమని ఆదేశించారు.

భగవాన్ బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో మరిన్ని దీనజనోద్ధరణ కేంద్రాలు అన్నిచోట్ల రావాలని కాంక్షిస్తూ దీన బాలుర జీవితాలలో ఆశాజ్యోతులు వెలగాలని, దృఢంగా విశ్వసిస్తూ....

సదా శ్రీ సత్యసాయి సేవలో
ఎ. రంగారావు
కన్వీనర్
శ్రీ సత్యసాయి ట్రస్ట్
ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్

# ప్రేమామృతమూర్తికి పుష్పాంజలి

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, కృష్ణా, ఖమ్మం, మెదక్, మెహబూబ్‌నగర్ జిల్లాల నుండి శ్రీ సత్యసాయి దీనజనోద్ధరణ పథకంలో ఆశ్రయం పొందుతున్న 97 మంది బాలురు తే. 02-03-2007 సాయంకాలం ప్రేమామృతమూర్తి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య సన్నిధిలో శ్రీ సత్యసాయి విద్యావిహార్, విశాఖపట్నం బాలురితో కలిసి వాద్యబృందం, వేదపఠనం, ఉపన్యాసం, చెక్కభజన, "జాగృతి" సంగీత నృత్య నాటకం ప్రదర్శించారు. ఈ సాంస్కృతిక కార్యాక్రమాల మాలికలో వాద్యబృందం, వేదపఠనం, శ్రీ సత్యసాయి విద్యావిహార్ బాలురు ప్రదర్శించగా మెహబూబ్‌నగర్ జిల్లా నుండి వచ్చి చి॥సాయిమణి తన ఉపన్యాసంతో స్వామినీ, శ్రోతల్నీ ఎంతో ఆకట్టుకున్నాడు. స్వామి చి॥సాయిమణికి విభూతి సృష్టించి అనుగ్రహించారు. శ్రీకాకుళం జిల్లా అరసవిల్లి బాలురు 'ఆదినారాయణుడే సాయినారాయణుడై....." అన్న భక్తి గీతానికి సంప్రదాయ బద్ధమైన చెక్కభజనను రమణీయంగా ప్రదర్శించారు.

తరువాత "జాగృతి" సంగీత నృత్య నాటకం ప్రదర్శింపబడింది. శ్రీసత్యసాయి దీనజనోద్ధరణ పథకం బాలురు "స్వార్థమే పరమార్థం" అని భావిస్తూ సిరికి దాసులైన వారిలో మానవత్వాన్ని ఎలా వికసింపజేయగలరో, కేవలం ధనదాహంతో విదేశాలకు పరుగెత్తాలనుకునే వారిలో దేశభక్తిని, సేవానురక్తిని ఎలా కలిగించగలరో, భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని తమ తల్లి, తండ్రి, గురువు, దైవంగా భావించే పిల్లల్లో ప్రేమ, సేవాభావాలు ఎలా పరిమళిస్తాయో 'జాగృతి' సంగీత నృత్య నాటకం హృదయానికి హత్తుకునేలా వివరించింది. ఈ పిల్లలు తమలో మానవతా విలువలు వికసింపజేసుకుని ఇతరులలో సత్ప్రవర్తనను ఏవిధంగా పెంపొందింపగలరో తెలియచేసింది. సందేశాత్మకమైన "జాగృతి" నాటక ప్రదర్శన ఆద్యంతం అత్యంత రసవత్తరంగా సాగి, ప్రేక్షకుల హృదయాలను కదిలించింది, కరిగించింది. వారి కళ్లలో  కన్నీరు కురిపించింది. భగవాన్ శ్రీసత్యసాయిబాబావారు నాటకాన్ని తిలకించి హృదయం ద్రవించి, కరుణ ఉప్పొంగి, ప్రేమామృతాన్ని కురిపించారు. ప్రదర్శనానంతరం భగవాన్ నాటకకర్త శ్రీ ఎమ్.ఎస్ ప్రకాశరావుని పిలిచి నాటక ప్రదర్శనను, రచనను ఎంతో ప్రశంసించి తన సంతోషాన్ని తెలియజేసి సువర్ణాంగులీయకాన్ని సృష్టించి అనుగ్రహించారు. అదేకాక పదివేల రూపాయల నగదు పురస్కారాన్ని కూడా అందజేసి ఈ నాటకాన్ని వెంటనే ముద్రించి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని నగరాలలో, పట్టణాలలో, గ్రామాలలో, అన్ని కళాశాలలలో, పాఠశాలలలో ప్రదర్శించాలని, శ్రీ సత్యసాయి దీనజనోద్ధరణ పథకం ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలలో ప్రారంభించాలని ఆదేశించారు. తరువాత నాటకంలో చక్రిపాత్రధారి చి॥వివేక్‌కు వెండి గణేశ్ విగ్రహాన్ని సృష్టించి అనుగ్రహించి, విభూతి అభిషేకం ప్రతిదినం చేసుకుని ఆ విభూతిని ధరించమని ఆశీర్వదించారు. ఆ ప్రేమమూర్తి ఎంతో దయతో నాటకంలో పాత్రధారణ చేసిన 150 మంది పిల్లలకు దుస్తులను పంచిపెట్టి పాద నమస్కారాలు అనుగ్రహించారు. ఆశీర్వదించారు. ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయి సేవాసంస్థలు స్వామి ఆజ్ఞను తలదాల్చి "జాగృతి" నాటకమును ముద్రించి, సి.డి.ల రూపంలో తయారు చేసి, అందరికి అందజేస్తున్నారు. ప్రతి సమితివారు ఈ నాటికను సందర్భోచితముగ ప్రదర్శించి అందులోని విలువల వ్యాప్తికై కృషి సల్పగలరని ఆకాంక్షిస్తూ....

సదా సాయిసేవలో

యన్. అంజనయ్య

రాష్ట్ర అధ్యక్షులు

# కరుణామూర్తికి కృతజ్ఞతాంజలి

## (చిరంజీవి సాయిమణి స్వామి దివ్యసన్నిధిలో ఇచ్చిన ఉపన్యాసం)

**ఓం సాయీశ్వరాయ విద్మహే**
**సత్యదేవాయ ధీమహి**
**తన్న స్సర్వః ప్రచోదయాత్॥**

ఓం శ్రీ సాయిరాం. తల్లి ప్రేమ ఎట్లా ఉంటుందో, తండ్రి ప్రేమ ఎట్లా ఉంటుందో తెలియని మాకు తల్లి, తండ్రి, గురువు, బంధువు, దైవము తానే అయిన మా స్వామికి భక్తితో నమస్కారాలు. అనాథలై వచ్చిన మమ్ము అనాథనాథుడయిన స్వామి రక్షించకుంటే, కాపాడకుంటే నిజంగా మేము అనాథలమైపోయేవాళ్ళం. మమ్ము కాపాడడం మాత్రమే కాక, అక్కున చేర్చుకున్న కరుణామూర్తి మా సాయిమాత. నిర్జీవమైపోతున్న మా బ్రతుకులకు జీవం పోసి మమ్మల్నందరిని తన దివ్య సన్నిధికి చేర్చిన బంగారుస్వామికి మా కృతజ్ఞతలు. క్రొత్తగా ఉన్న ఈ జీవితం మాకెంతో ఆనందాన్ని ఉత్సాహాన్ని అందిస్తోంది. మేమెంతో అదృష్టం చేసుకున్నాం. స్వామి అందించిన ఈ జీవితం ఎంతో విలువైనది. అక్షరమంటే ఏమిటో తెలియని మాకు అక్షరాలు నేర్పి చదువు విలువ తెలియజెప్పారు మా స్వామి. వేదాన్ని కూడా మాకు చక్కగా నేర్పించారు. వేదం చదువుతూంటే మేమేనా చదువుతున్నాము అని ఆశ్చర్యమేస్తుంది మాకు. చదువుతోపాటు మాచే ఆటలను కూడా ఆడించి ఎంతో ప్రోత్సహిస్తున్నారు. హాయిగా ఆడుకుంటుంటే మాకు అన్నీ అందించే స్వామి ఉండగా మాకే బాధా ఉండదని తెలుసుకున్నాం.

భగవంతుడెలా ఉంటాడో తెలియని మాకు సాయిదేవుని నీడలో ఉంటున్నందుకు ఎంతో ఆనందం కలుగుతోంది. చక్కని భజనలు మాకు నేర్పిస్తున్నారు. మేము కూడా అందరిలాగా ఉండగలమని అనిపిస్తోంది. వీటన్నింటికన్నా "క్రమశిక్షణ" గల ఈ జీవితం నిజంగా చాలా విలువైనది. పెద్దల యెడల గౌరవం, మితభాషణం, అందరితో సఖ్యంగా మెలగడం, పరోపకారం మొదలైన ఎన్నో మంచి గుణాలను అలవరచుకున్నాం.

మా ఆరోగ్యం గురించి మాకు బెంగ ఏమాత్రం లేదు. ఏ చిన్న కష్టమొచ్చినా మాకు సహాయమందించడానికి స్వామి మాకు ఎందరినో సిద్ధం చేశారు. ఎవరూ లేని మాకు అందరమూ ఉన్నామని ఆత్మీయతను పంచే సాయి కుటుంబ సభ్యులు మా చెంతనే ఉన్నారు.

ఇన్ని సదుపాయాలు, అవకాశాలు అందించిన శ్రీ సాయిభగవానునికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం. మేము వారి ఆశయాలకు అనుగుణంగా ప్రవర్తిస్తామని స్వామికి మాట ఇస్తున్నాం.

చక్కగా చదువుకొని, మంచి నడవడిక అలవరుచుకుని మంచి బుద్ధులతో మాలాంటి ఎందరికో సహాయాన్ని అందించగలిగే విధంగా మా జీవితాల్ని తీర్చిదిద్దుకుంటాం. ఎన్నటికీ మరువని స్వామి ప్రేమను పదిలంగా దాచుకుని స్వామికి, స్వామి సంస్థకు మంచి పేరు తెచ్చి మన దేశానికి మంచి కీర్తి తేగలమని, అటువంటి శక్తి, బుద్ధి స్వామి మాకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి పెరుగుదాం
కలసి మెలసి కలిమి చెలిమి బలము గుణము పెంచుదాం
కలసి మెలసి తెలుసుకున్న తెలివిని వెలిగించుదాం
కలసి మెలసి కలత లేక చెలిమిగ జీవించుదాం ॥

– జై సాయిరాం –

## సాయియే సర్వం

సాయిరాముడు నీకు ప్రతిపన్న భాగ్యంబు
జీవనాధారంబు జీవితంబు
సాయికృష్ణుడు నీకు ప్రేమబంధు బలంబు
సకల భోగఫలంబు సంతతంబు
సాయిగోపాలుడే రక్షక రాజంబు
సేవింప భజియింప శ్రీకరంబు
సాయిశివుడే నీకు ప్రాకట దైవంబు
సంసార క్షితి నార్వ సత్పదంబు
సాయి సేవయే నీకింక కామితంబు
సాయిప్రేమయే నీకింక ధీమతంబు
సాయిభజనయే సుజన విభ్రాజితంబు
సాయినామమే భువిలో సుధీమతంబు

“భగవదనుగ్రహమును పొందడానికి ఒక్క నామస్మరణే చాలు. నిరంతర భగవన్నామ స్మరణ వలన భక్తి, జ్ఞాన, వైరాగ్యములు అభివృద్ధి అవుతాయి. ఎంత దు:ఖము వచ్చినా, ఎంత కష్టము వచ్చినా నామము నాలుకపై నాట్యమాడుతూనే ఉండాలి. అయితే, కేవలం నోటితో పలికితే నేనొప్పుకోను. మొట్టమొదట అంతర్భావము పరిశుద్ధం కావాలి. అభీష్టము ఫలించకపోతే భక్తి తరిగిపోవడం, అభీష్టము సిద్ధిస్తే భక్తి అభివృద్ధి కావడం సరికాదు. కష్టనష్టములు వచ్చేది మీ మంచికోసమే. కష్టపడినప్పుడే వైరాగ్యము దృఢమౌతుంది. నా సైన్యంలో సుశిక్షితులైన యోధులుగా మీరు తయారు కావాలంటే కష్టాలకు, నష్టాలకు లొంగకూడదు. ఎప్పుడూ ఏకభక్తిగా ఉండాలి. భక్తి అంటే మీ జీవితమును పరమాత్మకు అంకితము చేయడం. ఏమి చేసినా, ఏమి చెప్పినా పరమాత్మపై దృష్టి పెట్టి ఆయనకే అర్పితమనే భావనతో చేస్తే, మీరున్నచోటే కాశీ, మీరు చేసే పనియే శివపూజగా మారిపోతుంది. పరమాత్మ నిబంధనలను మీరు తు.చ. తప్పక పాటించాలి. ఆజ్ఞను అనుసరిస్తే పరమాత్మతో సన్నిహిత సంబంధమును సంపాదించవచ్చు.”

# జాగృతి
## (సంగీత నృత్య నాటకం)

## ప్రార్థన

శ్లో॥ "శ్రీసాయి చరణం జగదేకశరణం
సత్యసాయిచరణం భవతాపహరణం
సత్యసాయిచరణం సకలార్తిహరణం
సత్యసాయిచరణం శరణంప్రపద్యే"

(శ్రీమంతుని ఇల్లు. చక్రి తన బృందంతో నృత్యం చేస్తూ ఉంటాడు)

చక్రి : ప॥ స్మరవారం వారం మానస – స్మర నందకుమారం ॥స్మర॥
చ॥1. గోపకుటీర పయోఘృతచోరం – గోకుల బృందావన సంచారం ॥స్మర॥
చ. 2. వేణు రవామృత పాన కిశోరం – విశ్వస్థితి లయ హేతువిచారం ॥స్మర॥

జగన్నాథం : (నృత్య ప్రదర్శన చూసి మహదానందంతో) అద్భుతం చక్రీ! నీ నృత్య ప్రదర్శన బ్రహ్మాండంగా ఉంది. Well done my son పట్టుదలతో నీ కృషి కొనసాగించు. త్వరలోనే రాష్ట్రఖ్యాతి, జాతీయ ఖ్యాతి, అంతర్జాతీయ ఖ్యాతి అందుకుంటావు. తరువాత కనకవర్షం కురుస్తుంది. ధనం ఉంటే చంద్రమండలానికి ఎగరొచ్చు. అంతరిక్షంలో హాయిగా విహరించవచ్చు. My son, అమెరికా యాత్రకి సిద్ధంగా ఉండు.

నరేష్ : హాయ్ అంకుల్! హాయ్ చక్రీ! అద్భుతంగా నృత్యం చేస్తున్నావట. పేపర్లో చదివాను. Congratulations

జగన్నాథం : వెల్‌కమ్ నరేష్! నీ గురించి విన్నాం. చూశావా చక్రీ. పిల్లవాడంటే అలా Ambitiousగా ఉండాలి. కోటీశ్వరుణ్ణి కావాలని కలలు కనాలి. అమెరికా వెళ్తున్నావట. Congratu lations

నరేష్ : ఔను అంకుల్, అక్కడే చదువు పూర్తి చేసి, ఉద్యోగం సంపాదించి, అక్కడే సెటిలయిపోదా

మనుకుంటున్నాను.

జగన్నాథం : అద్భుతమైన ఆలోచన. ఆస్తి, అంతస్థు సంపాదించుకోకపోతే, మానవజన్మ ఎందుకయ్యా. త్వరలో చక్రి కూడా అమెరికాలో నృత్య ప్రదర్శన ఇస్తాడు. అమెరికా జీవితం ఎలా ఉంటుందో మా చక్రికి చెప్పు.

నరేష్ : చక్రీ! అది భూలోకస్వర్గం. పూల పడవలాంటి కార్లో, స్వర్గ సుఖాల్లో తేలిపోతాం.

చక్రి : అంత అందంగా ఉంటుందా అమెరికా జీవితం

నరేష్ : హంసల్లా ఆకాశంలో ఎగురుతున్నట్టుంటుంది.

జగన్నాథం : కరెక్టు. ఆలోచన అంటే అలా ఉండాలి.

చక్రి : నాన్నగారూ! నాకూ అమెరికా వెళ్ళాలని ఉంది.

జగన్నాథం : ఒక్క అమెరికా ఏమిటి మై సన్, ఇంగ్లాండ్, యూరప్, జపాన్, ఆస్ట్రేలియా ప్రపంచమంతా చుట్టి వద్దాం. నీ పేరు ప్రపంచమంతా మారుమ్రోగిపోవాలి. మహారాజభోగాల్లో మనం మునిగితేలాలి.

నరేష్ : ఫైన్ అంకుల్. Bye చక్రీ, నేనర్జంటుగా వెళ్ళాలి. Bye అంకుల్.

జగన్నాథం : చక్రీ! విశ్రాంతి తీసుకో. నేను వారం రోజులు టూర్‌లో ఉంటాను. మీ మమ్మీ "స్త్రీ స్వాతంత్ర్యం" మీటింగులకి వెళ్ళింది. ఈ నెలాఖరుకి తిరిగి వస్తుంది. నీకేం కావలసినా ఆయాని అడుగు. క్షణాల్లో ఏర్పాటు చేస్తుంది Bye

(పాశ్చాత్య సంగీతం వింటూ చక్రి మైమరచిపోతూ ఉంటాడు)

సత్యం : చక్రీ...చక్రీ (చక్రి మాట్లాడదు) అంత పరధ్యానంగా ఉన్నావేం

: అబ్బే ఏం లేదు

సత్యం : ఏం లేదనకు. వారం రోజుల క్రితం నరేష్ ఇక్కడికి వచ్చాడని తెలిసింది.

చక్రి : ఔను వచ్చాడు

సత్యం : ఇంకేం. అమెరికాలో అడుగు పెడితే మోక్షం సాధించినట్టని, మానవ జన్మకు మహాభాగ్యం అదేననీ, తన వాక్చాతుర్యంతో నీ కళ్లముందు ఒక కలల స్వర్గం సృష్టించి ఉంటాడు. అమెరికా వెళ్తే కోట్లకు కోట్లు సంపాదించవచ్చని కూడా చెప్పి ఉంటాడు. మీ డాడీ దానికి వంత పాడి ఉంటాడు అంతేనా?

చక్రి : వాళ్ళు చెప్పింది నిజమే కదా! ఏ చదువైనా, కళైనా డబ్బు సంపాదించడానికే కదా.

సత్యం : కాదు. "సత్ప్రవర్తన, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ కర్తవ్యపాలనంబు నేర్పునదె

విద్య" గుణం పెంచేది విద్య కాని, ధనం దైవమనేది విద్య కాదు. నీతిని బోధించేది విద్య, జాతిని ధ్వేషించమనేది విద్య కాదు. కళ కూడా అంతే.

చక్రి : మరి ధనం లేకుండా జీవించగలమా?

సత్యం : శృతి మించిన కోరికల్నీ, హద్దులేని అడంబరాలనీ అదుపులో పెట్టుకుంటే, ఆనందంగా జీవించడానికి ఐశ్వర్యం అక్కరలేదు. తోటివారిని ప్రేమించడంలో సుఖం ఉంది. సాటి వారికి సేవ చేయడంలో ఆనందం ఉంది.

చక్రి : ప్రేమా, సేవా అంటూ కూర్చుంటే కడుపు నిండుతుందా?

సత్యం : ప్రేమ లేని మానవుడు, ప్రాణం లేని జీవుడు చక్రీ. ప్రేమ పశువులాంటి మనిషిని కూడా పశుపతిగా మారుస్తుంది. సేవను మించిన పూజ, సేవను మించిన తపస్సూ లేవు. సేవ చేసిన వాణ్ణి భగవంతుడు సేవ్ చేస్తాడు చక్రీ.

చక్రి : ఇది నిజమా! నమ్మమంటారా!

సత్యం : అక్షరాలా నిజం. ధనాన్ని తృణీకరించిన పోతనను శ్రీరాముడు కరుణించలేదా! రాజభోగాలను కాలదన్నిన మీరాబాయిని గిరిధర గోపాలుడు రక్షించలేదా! అన్నార్తుల్ని అన్నపూర్ణలా ఆదరించిన డొక్కా సీతమ్మ గారి హృదయం ఆనందంతో పరవశించలేదా!

చక్రి : ఇవన్నీ నాకు తెలియవు సత్యం.

సత్యం : అవును. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు తెలియకుండా పెరిగిన నీకేం తెలుస్తాయి. ఒక్కమారు చరిత్రపుటలు తిరగేసి చూడు. ఎంతమంది త్యాగధనులు మనదేశంలో పుట్టారో తెలుస్తుంది.

(పోతనామాత్యుడు "రామా కోదండరామా" అని రామనామగానం చేస్తూ ఉంటాడు.
ఆ పాటకు పిల్లలు నృత్యం చేస్తూ ఉంటారు)

పల్లవి : రామా కోదండరామా
రామా పట్టాభిరామా
రామా కళ్యాణరామా రాఘవా

చ. 1. రామా నీ దొక్కమాట రామా నాకొక్క మూట
రామా నీ మాటే మాట రామా నీ బాటే బాట

చ. 2. రామా సీతాపతి రామా నీవే గతి

రామా నీకు మ్రొక్కితి      రామా నీ చేజిక్కితి

చ. 3.      రామనామమే మేలు      రామచెంతనే చాలు

రామా నేను నీ వాడు      రామా నాతో మాట్లాడు

(పోతన భాగవత రచనకు వ్యాపీఠం ముందు దర్భాసనం మీద కూర్చుంటాడు)

పోతన : శ్లో॥ శ్రీరామ రామ రామేతి రమేరామే మనోరమే

సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే

భటుడు : అయ్యా! పోతనగారూ

పోతన : ఎవరు నాయనా

భటుడు : కవిసామ్రాట్ శ్రీనాథకవి వేంచేశారు

పోతన : అలాగా! బావగారు శ్రీనాథ కవివరేణ్యులకు నమస్కారాలు

శ్రీనాథుడు : "ఊ" (హుందాగా తల పంకిస్తాడు)

పోతన : రండి, ఇలా కూర్చోండి బావగారూ

శ్రీనాథుడు : నేను కూర్చోతగిన ఆసనాలిక్కడ లేవులెండి. ఇంతకీ మీ భాగవత రచన ఎంతవరకూ వచ్చింది

పోతన : శ్రీరామానుగ్రహం వల్ల పూర్తి కావచ్చింది.

శ్రీనాథుడు : ఏదీ మీ భాగవతంలోని ఒక్క పద్యం చదివి వినిపించండి.

పోతన : పద్యం ఉ॥ ఎవ్వరిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై

యెవ్వనియందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం

బెవ్వ డనాది మధ్యలయుడెవ్వడు, సర్వము తానెయైనవా

డెవ్వడు వాని నాత్మభవు ఈశ్వరునే శరణంబు వేడెదన్

శ్రీనాథుడు : పదలాలిత్యంతో, భక్తి భావనలతో మీ కవిత్వం మృదుమధురంగా ఉంది

పోతన : అంతా ఆ శ్రీరామ వరప్రసాదం బావగారూ

శ్రీనాథుడు : కాని ఆ వరప్రసాదం ఆకలి తీర్చదు కదా! భోగభాగ్యాలు అందించదు కదా!

పోతన : భోగభాగ్యాలు నేనాశిస్తే కదా బావగారూ

శ్రీనాథుడు : మీరాశించక పోవచ్చు. కాని, మీ కుటుంబానికవి కావాలి. వారు సుఖంగా జీవించడానికీ, ఆనందాన్ననుభవించడానికీ సంపద అవసరం.

పోతన : ఇప్పుడు మా సుఖానికేం లోటు బావగారూ

శ్రీనాథుడు : హు. మీరెంత సుఖంగా ఉన్నారో చూస్తూనే ఉన్నాను కదా! ఆత్మీయుడిగా చెబుతున్నాను. ఆలోచించండి. అపురూపమూ, అపూర్వమూ అయిన మీ భాగవత కావ్యాన్ని శ్రీ సింగ భూపాల ప్రభువుకు అంకితమివ్వండి. సంతోషంగా స్వీకరిస్తారు. ఘనంగా సత్కరిస్తారు. మీ ఇంట కనక వర్షం కురుస్తుంది.

పోతన : (ఆ మాటకు నొచ్చుకుంటూ) శ్రీరామచంద్రా! మన్నించండి బావగారూ! కరుణార్ద్రమూర్తి, ఆ శ్రీరామచంద్రమూర్తి పాదారవిందాలకంకితం చేసిన, నా జీవన సర్వస్వం, నా ప్రాణం. ఈ మహా భాగవతాన్ని తుచ్ఛమూ, ఆశాశ్వతమూ అయిన ధనం కోసం, మానవమాత్రుల కంకిత మియ్యమంటారా?

పద్యం ఉ॥ బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
కూళలకిచ్చి అప్పుడపుకూడు భుజించుటకన్న సత్కవుల్
హాళికులైననేమి గహనాంతరసీమల కందమూలకౌ
ద్దాళికులైననేమి నిజదారసుతోదర పోషణార్థమై

శ్రీనాథుడు : సిరిరామోకాలొడ్డే మీవంటి వారికి మంచి సలహా ఇచ్చి ప్రయోజనం లేదు. వస్తాను.

(శ్రీనాథుడు నిష్క్రమిస్తాడు)

(సరస్వతీదేవి పోతన ఎదుట ప్రత్యక్షమౌతుంది)

సరస్వతీదేవి : పోతన్నా, పోతన్నా

పోతన : ఎవరూ! తల్లీ భారతీ నువ్వా! ఆ కన్నీరేమిటమ్మా.

పద్యం ఉ॥ కాటుకకంటి నీరు చనుకట్టు పయింబడనేల యేడ్చెదో!
కైటభ దైత్య మర్దనుని గాదిలి కోడల! యోమదంబ! యో
హాటకగర్భురాణి! విను నాకటికిం గొనిపోయి యల్లక
ర్ణాటకిరాత కీచకులమ్మ త్రిశుద్ధిగనమ్ము భారతీ!

(అని సరస్వతీ దేవి పాదాలపై మోకరిల్లుతాడు పోతన. నేపథ్యంలో "మా కురు ధన జన యవ్వన గర్వం" అన్న భజగోవింద శ్లోకం వినపడుతూ ఉంటుంది)

సత్యం : మహా భక్తుడయిన పోతన ఆ విధంగా ధనాన్ని తృణీకరించాడు. అందుకే రామానుగ్రహాన్ని పుష్కలంగా పొందాడు. కనకాభిషేకాలు పొందిన శ్రీనాథుడు చివరికి తినడానికి తిండి కూడా కరువై, దుర్భర దారిద్ర్యం అనుభవించి తనువు చాలించాడు. అందుకే, నీ మంచి కోరే స్నేహితునిగా చెబుతున్నాను. ధనవ్యామోహం అనే ఉచ్చులో పడకు.

చక్రి : ఈ సుఖాల్ని, భోగాల్ని కాలదున్నుకుంటే ఆనందంగా ఉండగలమా సత్యం?

సత్యం : ధనం నుంచి మన దృష్టి దైవం వైపు మళ్ళిస్తే, ఆయనే కన్నతల్లిలా, కంటికి రెప్పలా మనల్ని కాపాడతాడు.

చక్రి : అలా కాపాడిన సందర్భం ఉంటే చెప్పు సత్యం.

సత్యం : భక్త మీరాబాయి దీనికి చక్కని ఉదాహరణ చక్రీ! ఒకరోజు మీరా సంకీర్తన చేస్తోంది.

(మీరా తన్మయత్వంతో గానం చేస్తూ ఉంటుంది. భక్తులు నృత్యం చేస్తూ ఉంటారు)

పల్లవి : థానీ కాయీ కాయీ బోల్ సుణావా
మారతారా గిరిధారీ
పురబ్ జణమ్‌రీ ప్రీత్ పురానీ
జావాణా గిరిధారీ
మారతారా గిరిధారీ ॥థానీ॥

చ. 1. సుందర్ బదన్ జోవతా కాజల్
భారీ ఛబీ బలిహారీ
మారె ఆంగణమా శ్యామ్ పథారో
మంగళ్ భవ నారీ ఓ
మంగళ్ భవ నారీ
మారాతారా గిరిధారీ ॥థానీ॥

రాణా : (రాణా ప్రవేశించి కోపంగా) మీరా రాణీ! మీరిలా నడివీధుల్లో పాటలు పాడుకుంటూ, నృత్యం చేస్తూ, రాజవంశ ప్రతిష్ఠకు భంగం కలిగించకండి. గొప్ప రాజవంశంలో జన్మించారు; ఈ రాజభోగాల్ని కాలదన్నుకోకండి. మీ భక్తి అంత:పురానికే పరిమితం చెయ్యండి. మా సహనాన్ని పరీక్షించకండి.

మీరా : ప్రభూ! ప్రేమామృతమూర్తి ఆ గిరిధారి పాదారవిందాల కన్నా గొప్పవా. ఈ వంశ ప్రతిష్ఠలు. నీటి బుడగలాంటి రాజభోగాల్ని నమ్ముకుని శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదించే ఆ శ్యామసుందరుని గుణగానాన్ని వదులుకోలేను.

రాణా : మీరా రాణీ! రాత్రనక పగలనక మీరు చేసే సంకీర్తన, చేసే నృత్యాలు, మేవార్ రాజవంశానికి మాయని కళంకం, తీరని అవమానం. ఈ నేరానికి 'విషపాన' శిక్ష విధిస్తున్నాను మీకు. "ఊ!" విషపాత్రను అందించండి.

(భటుడు మీరాకు విషపాత్ర అందిస్తాడు)

మీరా : ప్రభూ! గిరిధారీ! నీ నానిర్ణయం ఇదే అయితే సంతోషంగా స్వీకరిస్తాను. శ్యామసుందరా!

నీ నామస్మరణ లేని జీవితం దివ్వె లేని మందిరం స్వామీ. ఈ జీవితం కన్నా మరణమే మేలు "కృష్ణార్పణం" (విషపానం చేస్తుంది. కొన్ని క్షణాలు అచేతనమై తిరిగి మీరా సంకీర్తన చేసుకుంటూ నిష్క్రమిస్తుంది.)

రాణా : ఆశ్చర్యం! విషం అమృతంగా మారిపోయిందే. మీరా మహాభక్తురాలయి ఉంటుంది. మీరా రాణీ! మీ భక్తి నిరుపమానం. (నమస్కరిస్తాడు)

(నేపథ్య సంగీతం)

చక్రి : ఏమద్భుతం. గిరిధారి కోసం రాజభోగాలను కాలదన్నిన మీరాబాయి మృత్యువును సహితం జయించింది.

సత్యం : అచంచల విశ్వాసం, నిరంతరచింతన, దైవానుగ్రహం – ఎలా కలిగిస్తాయో చూశావా.

చక్రి : ఇటువంటి మహాభక్తులు పుట్టిన దేశంలో పుట్టామన్నమాట.

సత్యం : ఔను చక్రీ, ప్రహ్లాదుడు, త్యాగరాజు, తుకారాం, చైతన్య మహా ప్రభువు వంటి మహాభక్తులు పుట్టిన పుణ్యభూమి మన దేశం. ఇటువంటి పుణ్యభూమినా వదిలి పెట్టాలనుకుంటున్నావు.

చక్రి : లేదు సత్యం. ఈ విషయాలు నాకెవరూ చెప్పలేదు.

సత్యం : అమ్మానాన్నల ప్రేమ కరువై 'ఆయా'ల పాలనలో పెరిగినవాడివి, ఇవి నీకెలా తెలుస్తాయి.

చక్రి : సత్యం నేను కార్లో తిరగాలనీ, విమానాల్లో విహరించాలనీ కోరుకోవడం తప్పా!

సత్యం : తప్పు కాకపోవచ్చు చక్రీ. కాని ఒక్కసారి నీ దేశం గురించి ఆలోచించు. ఈ దేశం నీకు జన్మనిచ్చింది. చదువూ, సంస్కారం నేర్పింది. సంపదనందించింది. మరి ఈదేశం పట్ల నీకే బాధ్యతా లేదా?

చక్రి : ఉంది. అది నేరవేర్చాలనీ ఉంది. కాని ఆ బాధ్యత ఎలా నెరవేర్చాలో నాకు తెలియదు.

సత్యం : నీ చుట్టూ ఒక్కసారి చూడు. ఎంతమంది పేదలు అన్నార్తులై అలమటిస్తున్నారో, ఎంతమంది నిర్భాగ్యులు సరియైన వైద్యంలేక ప్రాణాలు కోల్పోతున్నారో, ఎంతమంది త్రాగడానికి గుక్కెడు మంచి నీరు లేక బాధ పడుతున్నారో.

చక్రి : అంత దారుణంగా ఉందా పరిస్థితి?

సత్యం : ఉంది చక్రీ. మనలాంటివారికి కనువిప్పు కల్గించడానికే, డొక్కా సీతమ్మ లాంటి తల్లులు అన్నార్తుల్ని అన్నపూర్ణలా ఆదుకున్నారు.

(నేపథ్య సంగీతం వేదపండితుల ఇల్లు. "జాతవేదసే" వేదపఠనం చేస్తూ ఉంటారు. దానికనుగుణంగా పిల్లలు నృత్యం చేస్తూ ఉంటారు. ఇంతలో "పెట్టుకోండి, పట్టుకోండి, కొట్టండి" అన్న అరుపులు వినిపిస్తాయి)

| | | |
|---|---|---|
| శివుడు | : | అమ్మా! సీతమ్మగారూ! రక్షించండి. రక్షించండి (పరుగెత్తి వచ్చి భయంతో వణికిపోతూ సీతమ్మగారి పాదాలపై పడతాడు) |
| సీతమ్మ | : | లే నాయనా, భయపడకు, నేనున్నాను. |
| లక్ష్మయ్య | : | సీతమ్మగారూ! వాణ్ణి విడిచిపెట్టండి. వాడు దొంగ. వాణ్ణి శిక్షించాలి. |
| సీతయ్య | : | ఒక్కక్షణం ఆగు లక్ష్మయ్యా. దొంగైనా, దొరైనా వీడు నా బిడ్డ. ఇంతకీ ఏం దొంగిలించాడు? |
| లక్ష్మయ్య | : | మా తోటలో ఒక అరటిపండు దొంగతనం చేశాడు. |
| శివుడు | : | (గద్గదస్వరంతో) నేను అమ్మా, నాన్న లేని అనాథనమ్మా! రెండు రోజుల నుంచీ అన్నం తినలేదు. మీరు ఆదరిస్తారని, అన్నం పెడతారని తెలిసి మీ దగ్గరికొస్తూ దారిలో ఆకలికి తట్టుకోలేక ఒక అరటిపండు వీళ్ళ తోటలో దొంగిలించానమ్మగారు. (ఏడుస్తాడు) |
| సీతమ్మ | : | ఏడవకు నాయనా! నువ్వు అనాథవు కావు. నేనే మీ అమ్మననుకో లక్ష్మయ్యా! ఆగర్భ శ్రీమంతుడివి. ఆకలిబాధ తట్టుకోలేక పసిపిల్లాడు ఒక్క పండు తింటే నీ ఆస్తి కరిగిపోతుందా. నీ సంపద తరిగిపోతుందా? 'నాన్నా! రా' అని ఆప్యాయంగా పిలిచి ఒక్క అరటి పండిస్తే వాడు దొంగతనం చేసేవాడా? రూపాయి విలువ చెయ్యని అరటిపండు కోసం బంగారంలాంటి పసివాణ్ణి కొట్టడానికి సిద్ధపడ్డావే, నీకు సిగ్గు వెయ్యడంలేదా? |
| లక్ష్మయ్య | : | వాడు కులం తక్కువ వాడమ్మా! |
| సీతమ్మ భర్త | : | ఆహా! అలాగా మరి |

పద్యం :

శిరసు వంచినావు శివునికి కులమేది
హరిని కొలుతువు వారి కులమదేది
సృష్టికర్త బ్రహ్మ సూత్రమ్ము అదియేది
ఆదిశక్తి దుర్గ గోత్రమేది

చెప్పగలవా? చెప్పలేవు. మనస్సులో ప్రేమ ఉంటే సాటిమనిషిని ఆదరించడానికి ఈ కులాలు, మతాలు అడ్డురావయ్యా.

| | | |
|---|---|---|
| సీతమ్మ | : | (శివుణ్ణి దగ్గరకు తీసుకొని) నాన్నా, ఈ రోజు నించి నీ పేరు శివుడు. (అక్కడే వున్న పిల్లల్ని చూపిస్తూ) ఇదిగో వీళ్ళంతా నీ అన్నదమ్ములు. ఇదే నీ ఇల్లు. నేనే మీ అమ్మని. |
| శివుడు | : | అమ్మా! (సీతమ్మ, పాదాలపై పడిన శివుణ్ణి ఎత్తి హృదయానికి హత్తుకుంటుంది) |

("ఏ కులము నీదంటే గోకులము నవ్వింది" అన్న పాట నేపథ్యంలో వినిపిస్తుంది. ఇంతలో ఈదురుగాలి, తుఫాను వాతావరణం. అమ్మా సీతమ్మగారూ! ఆకలి అన్నం పెట్టండి" అని కేకలు వినిపిస్తూ ఉంటాయి.)

| | | |
|---|---|---|
| వ్యక్తి | : | (పరుగు పరుగున వచ్చి) అమ్మా! సీతమ్మగారూ! గోదావరి ఉధృతంగా పొంగుతోంది. వరద దాటి రాలేక లంకలో ఒక్క కుటుంబం చిక్కుకుపోయింది. సీతమ్మగారూ! ఆకలి, అన్నం పెట్టండని పాపం కేకలేస్తున్నారమ్మా! |
| సీతమ్మ | : | అలాగా నాయనా భోజనం సిద్ధంగా వుంది. పట్టుకొస్తానుండు. (శివుడు భోజనం మూట అందిస్తాడు) పద నాయనా వెళదాం. |
| సీతమ్మ భర్త | : | వద్దు సీతా! నువ్వు వెళ్ళలేవు. ఆ వరదలో పడవలే వెళ్ళడం లేదుట. |
| సీతమ్మ | : | "అమ్మా, ఆకలి" అని నా పిల్ల ఆర్తనాదాలు చేస్తూ ఉంటే వింటూ చేతులు కట్టుకుని కూర్చోమంటారా? నన్ను వెళ్ళనివ్వండి. |
| సీతమ్మభర్త | : | సరే. ఆ బుట్ట నాకియ్యి. నేనే వెళతాను. ఆ పై భగవంతుడున్నాడు. (బుట్ట పట్టుకొని వెళతాడు) |
| వ్యక్తి | : | అమ్మా! బాబుగారు వరద గోదావరి దాటాలి. ప్రాణభీతి లేదా అమ్మా. |
| సీతమ్మ | : | అన్నార్తులకి ఇంత అన్నం పెట్టలేనప్పుడు ఈ ప్రాణాలు ఉండి ఏం లాభమయ్యా? కానీ, ఆ భగవంతుడే ఉన్నాడు. |
| వ్యక్తి | : | (సీతమ్మ పాదాలకు నమస్కరిస్తాడు. అందరూ నిష్క్రమిస్తారు) |
| | | (నేపథ్య సంగీతం) |
| సత్యం | : | చూశావా చక్రీ. అన్నార్తుల్ని ఆదుకోడానికి ప్రాణాలకు కూడా లెక్క చెయ్యలేదు ఆ దంపతులు. మరి లక్షలాది దేశప్రజలు ఆకలితో అలమటిస్తూంటే మనం విందు భోజనాలు చెయ్యడం సమంజసమేనా? మన తోటివారు చిరిగిన బట్టలతో కాలక్షేపం చేస్తూ ఉంటే మనం సిల్కు బట్టలు ధరించడం న్యాయమేనా? |
| చక్రి | : | సత్యం! తలచుకుంటే బాధగానే ఉంది. మనం కూడా ఏదైనా చేద్దాం సత్యం. |
| సత్యం | : | తప్పక చేద్దాం. ముందు ఆ అమెరికా మోజు వదులుకో. ధనం సంకెళ్ళు తెంచుకో. మానవత్వాన్ని పెంచుకో. దీనుల బాధల్ని పంచుకో. ప్రేమతో వారిని ఆదుకో. వారి జీవితాల్లో ఆశాజ్యోతులు వెలిగించు. ఆనందాన్ని పంచు. |
| చక్రి | : | అలాగే చేస్తాను సత్యం. |
| | | (నేపథ్య సంగీతం) |
| జగన్నాధం | : | (ప్రవేశిస్తూ) ఓ! సత్యం నువ్వా! ప్రేమా, సేవా లాంటివి హితబోధలు చేస్తున్నావా మా వాడికి |
| సత్యం | : | మరి ధనమే దైవమని బోధించమన్నారా |

జగన్నాథం : మాతృభూమి, దేశభక్తి లాంటి బూర్జువా భావాలు మావాడి బుర్రలో చొప్పించకు.

సత్యం : మరి ధన వ్యామోహం, పదవీదాహం, అలవర్చుకోమని చెప్పమంటారా!

జగన్నాథం : వితండవాదం చేయకు. నా మాట వింటే నా కొడుకు కోటీశ్వరుడవుతాడు.

సత్యం : నా మాట వింటే వాడు ప్రహ్లాదుడవుతాడు.

జగన్నాథం : అంటే ధనం దైవాన్ని దూరం చేస్తుందా!

సత్యం : చెయ్యకపోవచ్చు. ధన వ్యామోహం మాత్రం దైవాన్ని తప్పక దూరం చేస్తుంది.

జగన్నాథం : మానవత్వం నీకే కాదు సత్యం మాకూ తెలుసు.

సత్యం : మీలో మానవత్వం ఎంతుందో ఇప్పుడే చూపిస్తాను. (వృద్ధ దంపతులు ప్రవేశం) వీరెవరో మీకు తెలుసనుకుంటాను.

జగన్నాథం : వీళ్ళిలా వచ్చారిక్కిడికి

సత్యం : మా పల్లెలో అనాధాశ్రమంలో వుంటే నేనే తీసుకొచ్చాను

చక్రి : వీళ్ళెవరు డాడీ.

సత్యం : మీ డాడీ చెప్పలేరు చక్రీ, నేను చెబుతాను. వీళ్ళు మీ డాడీ తల్లితండ్రులు. నీకు తాతగారు, బామ్మగారు.

చక్రి : నిజమా! మరి నా చిన్నప్పుడే చనిపోయారని చెప్పారే.

సత్యం : సంపద కోసం దైవంగా పూజించవలసిన కన్న తల్లితండ్రుల్ని అనాధ శరణాలయానికి తరలించారు. చూశావా చక్రీ. సిరికి దాసుడైనవాడు ఎంత దారుణానికి ఒడిగడతాడో. ఇప్పుడు తేల్చుకో ఎవరిమాట వినాలో.

చక్రి : సత్యం! నా కళ్ళు తెరిపించావు. నేను అమెరికా వెళ్ళను. నా కళను పూజా సుమంగా దేవుడి పాదాల దగ్గర అర్పిస్తాను. నిస్సహాయుల సేవకోసం వినియోగిస్తాను.

జగన్నాథం : చక్రీ!

చక్రి : మీరొక్క క్షణం మాట్లాడకండి. నన్ను శాసించే అధికారం మీరు కోల్పోయారు డాడీ. తాతయ్యా! మా డాడీ చేసిన పనికి మమ్మల్ని క్షమించు

సత్యం : జగన్నాథంగారూ! కడుపే కైలాసం. స్వార్థమే పరమార్థం అని భావించే మీలో మానవత్వం ఎలా మంట కలిసిపోయిందో చూశారా. జన్మనిచ్చి, పెంచి, పెద్ద చేసి, ఆస్తి ఇచ్చి, అంతస్తు కల్పించిన తల్లితండ్రుల్నే ఇంటినుంచి గెంటేశారు. ఇప్పుడు మీ కొడుకు అదే పని చేస్తే ఏం చేస్తారు?

జగన్నాథం : (తల వంచుకుని) నన్ను క్షమించు సత్యం. ఇన్నాళ్ళూ ధనమే లోకమని బ్రతికాను. ఇప్పుడు

నా అపరాధాన్ని తెలుసుకున్నాను. తల్లితండ్రుల్ని అవమానించినందుకు తలదించు కుంటున్నాను.

సత్యం : తల దించుకోకండి అంకుల్. సగర్వంగా తలెత్తుకునేలా మీ ప్రవర్తన సరిదిద్దుకోండి.

జగన్నాథం : నాన్నగారూ, అమ్మా నేను సహించలేని పొరపాటు చేశాను. నన్ను క్షమించండి.

తాత : బాధపడకు నాయనా.

సత్యం : తాతగారూ! మీరు మీ కుమారుడికి ఆస్తీ, అంతస్థూ ఇచ్చారు కానీ ఎప్పుడైనా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను బోధించారా?

తాత : చెప్పలేదు నాయనా! నిజమే

(చక్రి స్నేహితులు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి : వందే మాతరం, సుందర భారతం
విశ్వానికి వెలుగు చూపు ప్రేమ మందిరం
అని చెప్పారా? గళం విప్పారా!

చ. 1. సత్యహరిశ్చంద్రుని కన్నభూమిరా
బుద్ధుడు బోధించినట్టి పుణ్యభూమిరా
ధర్మమూర్తి శ్రీరాముని జన్మభూమిరా
గాంధీజీ ప్రభవించిన దివ్యభూమిరా (ఇది) ။వందే మాతరం။

 చ. 2. సత్యానికి స్వాగతాన్ని పలికిన దేశం
త్యాగానికి మణిమకుటం పెట్టినదేశం
ధర్మనిరతికి ఛత్రం పట్టినదేశం
న్యాయానికి కంకణాలు కట్టినదేశం (ఇది) ။వందే మాతరం။

(చక్రి స్నేహితులు నిష్క్రమిస్తారు)

జగన్నాథం : సత్యం, చిన్నవాడివి నీలో ఇంత మంచిభావాలు ఎలా కలిగాయి. ప్రేమభావం, సేవాభావం ఎలా అంకురించాయి

చక్రి : చెప్పు సత్యం. మేమూ ఆ బాటలో నడుస్తాం.

సత్యం : చెబుతాను. నేను తల్లీ, తండ్రీ లేని అనాధను. నా పూర్వపుణ్యం వల్ల శ్రీ సత్యసాయి దీనోద్ధరణ పథకం కన్నతల్లిలా నన్ను చేరదీసింది. ఆనాటినుండి బాబాయే నాకు తల్లీ

తండ్రీ అయ్యారు. ఆ ప్రేమమూర్తి దర్శనం చేసుకుని, వారి బోధనలను వినడం వల్ల స్నేహం అంటే విందులూ, వినోదాలు కాదని, ప్రేమ పంచి ఇవ్వడమని తెలుసుకున్నాను. చక్రి నా ప్రాణస్నేహితుడు, అమాయకుడు వాణ్ణి మంచి దారిలో పెట్టడం నా కర్తవ్యంగా భావించాను. ఈ ప్రయత్నంలో మిమ్మల్ని బాధపెడితే మన్నించండి.

జగన్నాథం : లేదుసత్యం. మంచి సలహా ఇచ్చినందుకు మేమే నీకు కృతజ్ఞులమై ఉండాలి. భగవాన్ బాబాని ఎక్కడ దర్శించవచ్చు. చెప్పు సత్యం.

సత్యం : పేదల గుండెల్లో, నిస్సహాయుల నిట్టూర్పుల్లో, దాహార్తుల దీనవదనాల్లో, రోగార్తుల కళ్ళలో, అనాథుల అశ్రునయనాలలో, ఆయన ఆశాజ్యోతిగా దర్శనమిస్తారు.

జగన్నాథం : ఆ ప్రేమమూర్తి ఎక్కడ ఉంటారు సత్యం?

సత్యం : కలియుగ కైలాసమూ, నవయుగ వైకుంఠమూ అయిన ప్రశాంతి నిలయంలో.

(చక్రి స్నేహితులు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి: ఇదె కైలాసం – ఇదె వైకుంఠం
పర్తీసాయి పరమపదం
సత్యసాయి దివ్యపథం ॥ఇదె కైలాసం॥

అ.పల్లవి: విభూతిసుందరమూర్తిగ సాయి
దర్శనమిచ్చే కైలాసం
అభయమునిచ్చి సాయిశ్రీహరి
రక్షణనొసగే వైకుంఠం ॥ఇదె కైలాసం॥

చ.1. విష్ణుపాదమున పుట్టిన గంగను
దాహార్తుల కందించాడు
పసిబాలునిగా ఎన్నో ఇడుముల
గరళము గళమున దాల్చాడు
'సాయీ' అన్న ఒక్క పిలుపుకే
పెనుబాధలు తొలగించాడు
కరుణామయుడై పుట్టపర్తిని
కైలాసంగా మార్చాడు ॥ఇదె కైలాసం॥

ch. 2 కడలిఅలలపై శేషపాన్పుపై
శ్రీహరి రూపం చూపాడు
గణపతి, మారుతి, మాతా, దుర్గా
సాయిగ దర్శనమిచ్చాడు
దశావతారములెత్తిన దైవం
తానేనని చూపించాడు
వైభవదీప్తుల వెలిగే పర్తిని
వైకుంఠమని చూపాడు ॥ఇదె కైలాసం॥
(చక్రి స్నేహితులు నిష్క్రమిస్తారు)

సత్యం : ఆ ప్రేమమూర్తి నా జీవితమే నా సందేశమని, తాను బోధించిన ప్రతీ ధర్మసూత్రాన్నీ ఆచరించి చూపిన మహనీయుడు. ఎవరూ అర్థించకుండానే వేలాది గ్రామాలకు మంచినీరు అందించాడు. లక్షలాది మంది హృద్రోగులకు ప్రేమ, సేవా భావాలు మేళవించి అమర వైద్యాన్ని అందించి ఆరోగ్యాన్ని సమకూర్చారు. ప్రతి విద్యార్థినీ ఒక వివేకానందుడిగా మార్చడానికి రూపాయి రుసుములేని విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. తల్లీ, తండ్రీ లేని అనాధల్ని అమ్మగా ఆదుకున్నారు. సర్వదేవతాతీత స్వరూపుడు శ్రీ సత్యసాయి. ఆ విశ్వప్రేమైకమూర్తి బోధించిన సేవా మార్గంలో పయనించండి. మీ జీవితాల్ని సార్థకం చేసుకోండి.

జగన్నాథం : సత్యం తప్పక నీతో కలిసి ఆ సేవా మార్గంలో పయనిస్తాం. ఆ స్వామి ఆశీస్సులు అందుకుంటాం.

చక్రి : గ్రామసేవయే రామసేవగా, సంఘసేవయే సర్వేశ్వరుడి సేవగా, మా జీవితాల్ని సార్థకం చేసుకుంటాం. ఆ ప్రేమమూర్తికి మా శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నాం.
(పిల్లలందరూ ఆనందంగా నృత్యం చేస్తారు)

పల్లవి : జై జై సాయిరాం, జై జై సాయిరాం, జై జై సాయిరాం
సర్వేశ్వరుడే సత్యసాయిగా అవతరించినాడూ
మానవజాతిని మహోన్నతంగా తీర్చిదిద్దినాడు
॥జైజై॥

చ. 1 మానసభజరే గురుచరణమ్మని భక్తిబీజములు నాటాడు

భక్తి బీజములు నాటాడు

ప్రేమరాజ్యమే రామరాజ్యమని ప్రేమజ్యోతి వెలిగించాడు

సాయీ – ప్రేమజ్యోతి వెలిగించాడు

సేవను మించిన సాధనలేదని శంఖారావం చేసాడు

శంఖారావం చేసాడు

గ్రామసేవయే రామసేవయని ఆచరించి చూపించాడు

ఆచరించి చూపించాడు

చల్లనిఒడిలో దీనులచేర్చి తల్లిప్రేమ అందించాడు

తల్లిప్రేమ అందించాడు

జై జై సాయిరాం, జై జై సాయిరాం, జై జై సాయిరాం,

చ. 2 వేద సంస్కృతికి జీవం పోసి ధర్మనరతి బోధించాడు

ధర్మనిరతి బోధించాడు

యువశక్తిని నవశక్తి మలచి సన్మార్గంలో నడిపాడు

సాయీ – సన్మార్గంలో నడిపాడు

సేవా, ప్రేమా తొణికిసలాడే

అమరవైద్యమందించావడు

మరుభూములలో దివిజగంగ

ప్రవహింపజేసి కరుణించాడు

నా జీవితమే సందేశమ్మని

ఇజయభేరి మ్రోగించాడు ॥జైజై॥

– జై సాయిరాం –

భావసంశుద్ధి కలుగుటే భక్తియగును

పుణ్యకార్యాలు చేయుటే పూజయగును

పరులకుపకారమొసగుటే తపసుఅగును

మరువబోకుడిటువంటి మంచిమాట

–బాబా

# శ్రీ సత్యసాయి దీనజనోద్ధరణ పథకం, ఆంధ్రప్రదేశ్

## (శ్రీ సత్యసాయి సేవాసంస్థలు, ఆంధ్రప్రదేశ్)

"దీనుల సేవయే దీనానాథుని సేవ" అంటారు భగవాన్ శ్రీసత్యసాయిబాబా. స్వామి పుట్టపర్తిలో 2000 సం॥లో శ్రీసత్యసాయి దీనజనోద్ధరణ పథకం ప్రారంభించి, తల్లి, తండ్రులను కోల్పయిన అనాథ బాలురకు ఆశ్రయం కల్పించి వారిని ఆదర్శపౌరులుగా, భక్తి, సేవాతత్పర భావాలు కల ఆదర్శవ్యక్తులుగా తీర్చిదిద్దుతున్నారు.

స్వామి సంకల్ప ప్రేరణతో, స్వామి ఆదేశంగా భావించి ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా ఖమ్మం జిల్లాలో 7 మంది బాలురతో దీనజనోద్ధరణ పథకం ప్రారంభించబడింది. అది దినదినాభివృద్ధి చెందుతూ ఈనాడు శ్రీకాకుళం జిల్లాలో అరసవిల్లి, రాజాం గ్రామాలలో, విశాఖ జిల్లాలో విశాఖపట్నం, ఉక్కు నగరాలలో, విజయనగరం జిల్లాలో లక్ష్మిపురం గ్రామంలో, పశ్చిగోదావరి జిల్లాలో తణుకు పట్టణంలో, ఖమ్మం జిల్లాలో ఖమ్మం మరియు కొత్తగూడెం పట్టణాలలో, మెదక్ జిల్లాలో వర్గల్ గ్రామంలో, మెహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి, వనపర్తి గ్రామాలలో, హైదరాబాద్ జిల్లాలో సరూర్‌నగర్‌లో, కృష్ణా జిల్లాలో విజయవాడ పట్టణంలో, కరీంనగర్ జిల్లాలో కరీంనగర్ పట్టణంలో మొత్తం 100 మంది బాలురు శ్రీసత్యసాయి దీనజనోద్ధరణ పథకంలో ఆశ్రయం పొందుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం పిల్లల ఎంపిక దగ్గర నుంచి వారి భవిష్యజ్జీవితం వరకూ ప్రణాళికాబద్ధంగా జరుగుతోంది. ముందుగా తల్లిదండ్రులు లేనివారిని, నిరాధారంగా తల్లి ఒక్కరే మిగిలినవారిని పిల్లలను ఎంపిక చేయడం జరిగింది. వారి ఉజ్జ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, చదువులో శ్రద్ధ కలవారిని, మంచి ఆరోగ్యం ఉన్నవారిని, క్రమశిక్షణ పాటించాలనే సంకల్పం ఉన్నవారిని, ముఖ్యంగా 6-13 సంవత్సరాల మధ్య వయోపరిమితి ఉన్న బాలురను మాత్రమే ఎంపిక చేయడం జరిగింది. వారిని సాయిసెంటర్స్‌కు తీసుకువచ్చి పరీక్షపెట్టి వారి అర్హతకు తగిన తరగతులలో, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, ఆంగ్లమాధ్యమంలో బోధన జరుగుతున్న పాఠశాలలలో చేర్చడం జరిగింది.

వైద్యనిపుణుల సలహా మేరకు రూపొందించిన వీరి దినచర్యను గమనిస్తే అద్భుతమైన క్రమశిక్షణ, సమయపాలన, ఆరోగ్య నియమానుసరణ కనిపిస్తుంది. అదేగాక, ఈ పిల్లలు శారీరకంగా, మానసికంగా, మేధోపరంగా చక్కని ఆరోగ్యాన్ని కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో, కాలానుగుణంగా దొరికే పండ్లు కూడా వీరి భోజనంలో సమకూర్చడం జరుగుతోంది.

ఈ దీనజనోద్ధరణ పథకంలో ఒక ముఖ్యమైన విషయం ఈ పిల్లలకు అనాథులమనే భావన లేకుండా చెయ్యడం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్రాంతి, ఉగాది మొదలైన పర్వదినాలలో సాయి కుటుంబ సభ్యుల

ఇండ్లకు ఈ పిల్లలను ఆహ్వానించి వారితోపాటు ఉత్సవాల్లో పాల్గొనేటట్లు చేయడం జరుగుతోంది. దీనివల్ల తాము ప్రేమ పంచి ఇచ్చే ఆత్మీయుల మధ్య ఉన్నామనే భావన వారిలో కలుగుతుంది.

కేవలం ఆధారం కల్పించటమే కాక ఈ పిల్లల ఉజ్జ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి విద్యలో ఉన్నత ప్రమాణాలు సాధించేలా విద్య బోధించడం, వారిలో మానవతావిలువలు వికసించేలా భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను బోధించడం జరుగుతోంది. అన్నిటినీ మించి భక్తి, సేవా తత్పరత భావాలు వారిలో పెంపొందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, వారిని భవిష్యత్తులో భగవాన్ బాబా వారి దివ్య అవతార లక్ష్యమైన ప్రేమా, సేవాభావాన్ని అలవర్చుకున్న సంఘసేవకులుగా, కుల, మత, దేశ, వర్గాతీతంగా "వసుధైక కుటుంబకమ్" అన్న లక్ష్యాన్ని సాధించడానికి శ్రీ సత్యసాయి అవతార ఉద్యమంలో ఈ బిడ్డలను ఉత్తమమైన పనిముట్లుగా రూపొందించడమే శ్రీసత్యసాయి దీనజనోద్ధరణ పథక లక్ష్యం.

జై సాయిరాం

**భారతదేశం పుణ్యభూమి, త్యాగభూమి, శివుడు ఇట్టి**
**పవిత్ర భూమియందు పుట్టక ఇంకెక్కడ పుడతాడు**

– బాబా